## దేశంలో 561 మంది మరణ శిక్ష ఖైదీలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: దేశంలో మరణ శిక్ష పడిన 561 మంది ఖైదీలు చావు కోసం ఎదురు చూస్తున్నారు. ఇంత సంఖ్యలో మరణ శిక్ష పడిన ఖైదీలు ఉండటం గత రెండు దశాబ్దాల కాలంలోనే అత్యధికం. 2015 నుంచి వీరి సంఖ్య 45.71 శాతం పెరిగినట్టు ఢిల్లీకి చెందిన నేషనల్ లా యూనివర్సిటీలో ప్రచురించిన 'డెత్ పెనాల్టీ ఇండియా' తన నివేదికలో వెల్లడించింది. 2023లో ట్రయల్ కోర్టులు 120 మందికి మరణ శిక్ష విధించాయి. ఇక హైకోర్టుల విషయానికొస్తే కర్ణాటక హైకోర్టు 2023లో ఒక మరణ శిక్షను ఖరారు చేసింది. 2000 నుంచి చూస్తే అప్పీలేట్ కోర్టులు 2023లో అతి తక్కువ శాతం మరణ శిక్షను ఖరారు చేశాయి.

# 'నమస్తే' ప్రాపర్టీషో గ్రాండ్ సక్సెస్

- రెండ్రోజులూ కిటకిటలాడిన ప్రదర్శన
- మళ్లీ మళ్లీ ఏర్పాటు చేయాలని సందర్శకుల సూచన
- నిర్వాహకులకు కృతజ్ఞతలు

కార్పొరేషన్ (కరీంనగర్), ఫిబ్రవరి 10: ప్రజల సొంతింటి కలను నెరవేర్చేందుకు కరీంనగర్‌లో 'నమస్తే తెలంగాణ', 'తెలంగాణ టుడే' పత్రికలు సంయుక్తంగా నిర్వహించిన ప్రాపర్టీషో గ్రాండ్ సక్సెస్ అయింది. కలెక్టరేట్ ఎదుట రెవెన్యూ గార్డెన్‌లో రెండ్రోజులపాటు కొనసాగిన ఈ ప్రదర్శనలో ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలు, బ్యాంకులు ఏర్పాటు చేసిన స్టాళ్లకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన 1,200 మందికిపైగా ప్రజలు ఈ స్టాళ్లను సందర్శించారు. వివిధ ప్రాంతాల్లోని వెంచర్లు, అపార్ట్‌మెంట్లు, ఇండ్లు, ఇండ్ల స్థలాల వివరాలతోపాటు వాటి కొనుగోలుకు బ్యాంకర్లు కల్పిస్తున్న రుణ సదుపాయాల గురించి తెలుసుకున్నారు. వారిలో కొందరు అక్కడికక్కడే ఇండ్లు, ప్లాట్లను బుక్ చేసుకుని, అడ్వాన్సులు చెల్లించారు. శనివారం ముగింపు కార్యక్రమానికి కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్, కేడీసీసీబీ సీఈవో సత్యనారాయణరావు, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థిరాస్తుల కొనుగోలుకు ఎంతో ఉపకరిస్తున్న ఇలాంటి ప్రాపర్టీషోలను మళ్లీ మళ్లీ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ ప్రదర్శనను నిర్వహించిన 'నమస్తే తెలంగాణ', 'తెలంగాణ టుడే' పత్రికలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో 'నమస్తే తెలంగాణ' కరీంనగర్ బ్రాంచి మేనేజర్, బ్యూరో ఇన్‌చార్జి కే ప్రకాశ్‌రావు, యాడ్స్ మేనేజర్ రేణ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



కరీంనగర్‌లో నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రాపర్టీ షోలో కూపన్ విజేత డాక్టర్ ఉప్పులూరి అనుపమకు గిఫ్ట్ అందజేస్తున్న ఆర్డీవో మహేశ్వర్, కేడీసీసీబీ సీఈవో సత్యనారాయణరావు, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు. చిత్రంలో నమస్తే తెలంగాణ బీఎం, బ్యూరో ఇన్‌చార్జి కే ప్రకాశ్‌రావు



సంపూర్ణమైన రుచి
దానితోపాటు తియ్యదనం.
32g PROTEIN
Amul
BUFFALO MILK
A2 MILK
అమూల్ పాలు



కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో స్వీట్లు పంపిణీ చేస్తున్న పీవీ సేవా సమితి నాయకులు

## పీవీకి భారతరత్నపై హర్షాతిరేకాలు

**ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సంబురాలు**

కొత్తపల్లి/హుజూరాబాద్‌టౌన్/మంథని, ఫిబ్రవరి 10: దివంగత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు భారతరత్న ప్రకటించడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా శనివారం సంబురాలు జరుపుకొన్నారు. కరీంనగర్‌లో టీఎన్జీవోస్ కేంద్రం సంఘం కార్యదర్శి మారం జగదీశ్ నేతృత్వంలో నాయకులు స్వీట్లు పంచిపెట్టారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పీవీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హుజూరాబాద్ అంబేద్కర్ పీవీ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలుపుతూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. జగిత్యాలలో బీజేపీ నాయకులు పీవీ చిత్రపటంవద్ద నివాళులర్పించారు. అనంతరం ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పెద్దపల్లి జిల్లా మంథనిలో పీవీ విగ్రహానికి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు.

## గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడిగా కొండూరి నామినేట్



విద్యానగర్/గంభీరావుపేట, ఫిబ్రవరి 10: దక్షిణ భారత సహకార రంగానికి అరుదైన గౌరవం దక్కింది. నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(ఎన్‌సీడీసీ), బ్యాంకర్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (బీఐఆర్‌డీ) గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడిగా నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు వరుసగా రెండోసారి నామినేట్ అయ్యారు. కేంద్రహోం, సహకార శాఖ మంత్రి అమిత్‌షా నేతృత్వంలో ఎన్‌సీడీసీ వివిధ రకాల రుణాలు, వ్యవసాయం, అనుబంధ రంగాల వారు ఆర్థిక సామర్థ్యం పెంపొందించుకోవడానికి సహకారం అందిస్తుందని రవీందర్‌రావు తెలిపారు. బీఐఆర్‌డీ గ్రామీణ సహకార రంగం, వాణిజ్య బ్యాంకుల ఉద్యోగులకు శిక్షణ, సామర్థ్యం పెంపొందించడానికి పనిచేస్తుందని కొండూరి చెప్పారు.

## నలుగురు ఇటుకబట్టీ కార్మికుల మృతి

- పెద్దపల్లి, సంగారెడ్డి జిల్లాల్లో ఇద్దరు చొప్పున..
- ఫుడ్‌పాయిజనే కారణం!

పెద్దపల్లి రూరల్/హత్నూర, ఫిబ్రవరి 10: ఇటుక బట్టీల వద్ద జరిగిన ఫుడ్ పాయిజన్‌తో వేర్వేరు చోట్ల నలుగురు మృతి చెందారు. మరో 19 మంది అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటనలు పెద్దపల్లి, సంగారెడ్డి జిల్లాల్లో చోటుచేసుకున్నాయి. వివరాలు ఇలా.. పెద్దపల్లి జిల్లా కేంద్రం సమీపంలోని గౌరెడ్డిపేట, రంగాపూర్ శివారులో ఎంఎస్‌ఆర్ ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న ఒడిశా కార్మికులు రోజు మాదిరిగానే శుక్రవారం ఉదయం అన్నం తిని పనులు ప్రారంభించారు. ఈ క్రమంలో కొంత మంది తల తిరిగి పడిపోయారు. గమనించిన సూపర్‌వైజర్లు వెంటనే యజమానికి సమాచారం ఇచ్చారు. వారందరినీ పెద్దపల్లి దవాఖానకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితిని బట్టి ఆరుగురిని కరీంనగర్‌కు తరలించారు. పెద్దపల్లిలో నలుగురు చికిత్స పొందుతున్నారు. మరికొందరిని వరంగల్‌కు పంపించారు. కాగా.. కరీంనగర్‌కు తరలించిన వారిలో ఒడిశా రాష్ట్రం బలంగీర్ జిల్లాకు చెందిన చంద్రశేఖర్ భారీషా (54) శుక్రవారం సాయంత్రమే మృతి చెందగా ఆయన మృతదేహాన్ని అధికారులు రాకముందే దహనం చేశారు. ఇదే తరహాలో పరిస్థితి విషమించి లలితమాజీ (26) అనే మహిళా కార్మికురాలు శనివారం మృతి చెందింది. ఈ ఘటనపై పెద్దపల్లి సీఐ కృష్ణ, బసంత్‌నగర్ ఎస్సై వెంకటేశ్ పూర్తిస్థాయిలో వివరాలు సేకరించి, విచారణ చేపట్టారు. మృతుల కుటుంబ సభ్యులు, ఇటుక బట్టీ యజమాని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సులువ వెంకటేశ్ తెలిపారు.

**సంగారెడ్డి జిల్లాలో..**

ఒడిశాకు చెందిన అమలాల్ మొహజీ (35) భార్య నర్మద మొహజీ, ఇద్దరు కొడుకులు జైమొహజీ, అన్షు మొహజీతో కలిసి బతుకుదెరువు కోసం సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం కొత్తగూడెం శివారుకు వచ్చి ఇటుక బట్టీలో రెండు నెలలుగా పనిచేస్తున్నాడు. కొద్దిరోజులుగా అమలాల్ మొహజీ, చిన్నకొడుకు రెండున్నరేండ్ల అన్షు మొహజీ విరేచనాలతో బాధపడుతూ అనారోగ్యానికి గురయ్యారు. శుక్రవారం అర్ధరాత్రి విరేచనాలు ఎక్కువ కావడంతో చికిత్స నిమిత్తం ఇటుక బట్టీల యజమాని మాన్‌సింగ్ తన కారులో సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించాడు. అప్పటికే వారు మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఇంటిపెద్దతోపాటు కుమారుడు మృతిచెందడంతో మృతుడి భార్య నర్మద మొహజీ కన్నీరుమున్నీరైంది. నర్మద ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు హత్నూర ఎస్సై సుభాష్ తెలిపారు. కాగా.. ఇటుక బట్టీల వద్ద యజమానులు కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతోనే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి కుటుంబ సభ్యులతో వలస వస్తున్న కార్మికులకు బట్టీల వద్ద యజమానులు కనీస సౌకర్యాలు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు

MSME-TOOL ROOM, HYDERABAD
(CENTRAL INSTITUTE OF TOOL DESIGN)
(A Government of India Society, Ministry of MSME)
Balanagar 'X' Roads, Hyderabad-500037, Telangana State, INDIA.

NOTIFICATION FOR WALK - IN INTERVIEW

CITD intends to engage suitable candidates in the following posts which are purely on consolidate payment and on contractual basis initially for a period of 11 months, which will be renewed from time to time on performance review of the candidate and need of the institute.

| S.No | Name of the Post | No. of Vacancy | Date of Interview |
|---|---|---|---|
| 1 | Faculty for Electrical Engineering | 01 | 17th February, 2024 |
| 2 | Faculty for Tool Design & Engineering | 01 | |
| 3 | Faculty for Mechanical Engineering | 02 | 24th February, 2024 |
| 4 | Faculty for Automation Engineering | 01 | |
| 5 | Administrative Assistant | 02 | 02nd March, 2024 |
| 6 | Instructor: Conventional and CNC Machines | 05 | |
| 7 | Faculty for Chemistry | 01 | 16th March, 2024 |
| 8 | Faculty for Mathematics | 01 | |

For detailed information: Visit the link "Walk –in Interview – February, 2024" on our website : www.citdindia.org

Sd/-
PRINCIPAL DIRECTOR

## వ్యవసాయ రంగానికి ఇక్రిశాట్ రక్ష

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): వ్యవసాయ రంగానికి ఇక్రిశాట్ రక్షణ కవచంలా నిలుస్తున్నది. వాతావరణ మార్పులు, భూసారం తగ్గుదల, తెగుళ్ల వల్ల ఎదురవుతున్న పలు సమస్యలకు పరిష్కారం చూపుతున్నది. ఇక్రిశాట్ ఇప్పటివరకు అంతరించిపోయే ప్రమాదం ఉన్న 33 వేల వంగడాలను సంరక్షించింది. వీటిలో 20,838 రకాల శనగ వండగాలు, 13,559 రకాల కంది వంగడాలు ఉన్నాయి. వివిధ రకాల వాతావరణ పరిస్థితుల్లో సాగుకు అనువైన ఈ వంగడాలను 218 దేశాలకు పంపిణీ చేసింది.



Coromandel FUTURE POSITIVE
గ్రోమోర్ రైతు సంబరాలు
ఈ స్కీమ్ గ్రోమోర్ 20-20-0-13 మరియు
ప్యారంఫాస్ (16-20-0-13) కి మాత్రమే వర్తిస్తుంది
గ్రోమోర్
ఎక్కువ బస్తాలు కొనండి
ఎక్కువ బహుమతులు పొందండి
Bhartiya Jan Urvarak Pariyojna
GROMOR
2 ట్రాక్టర్లు
16 బుల్లెట్లు
72 మోపెడ్
1600 వెండి నాణేలు
7997 532 532
మీ పేరును నమోదు చేయడానికి
ఈ నెంబర్‌కు, కూపన్ నెంబరు పంపించండి
ఈ కూపన్ యొక్క వ్యవధి - 15 నవంబర్ 2023 నుండి 29 ఫిబ్రవరి 2024 వరకు మాత్రమే.

| ఎరువుల బస్తాలు | కూపన్లు |
|---|---|
| 2 | 1 |
| 5 | 3 |
| 10 | 8 |
| 15 | 12 |
| 20 | 15 |
| >20 | 1 ప్రతి బస్తాకి |

## బిల్లు మంజూరుకు 50 వేలు లంచం

### ఏసీబీకి చిక్కిన మున్సిపల్ ఏఈ



ఏసీబీకి చిక్కిన ఏఈ పృథ్వీ

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, ఫిబ్రవరి 10: లంచం తీసుకుంటూ మున్సిపల్ ఏఈ ఏసీబీ అధికారులకు చిక్కాడు. మహబూబ్‌నగర్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ కృష్ణగౌడ్ కథనం మేరకు.. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో కాంట్రాక్టర్ పిట్ల యాదయ్య వివిధ పనులు చేయించారు. సీసీ రోడ్లకు సంబంధించి రూ.5 లక్షలు, వివిధ జంక్షన్లలో లైట్ల ఏర్పాటుకు సంబంధించి రూ.6 లక్షలు కలిపి మొత్తం రూ.11 లక్షల పనులు చేపట్టారు. ఈ బిల్లులు మంజూరు చేయాలని మున్సిపల్ ఏఈ పృథ్వీని సంప్రదించగా.. రూ.70 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. చివరకు రూ.50 వేల వరకు ఒప్పందం కుదిరింది. డబ్బులు ఇస్తానని కాంట్రాక్టర్ ఏఈ పృథ్వీకి శనివారం ఫోన్ చేశారు. అతను సూచించిన చోటుకు వెళ్లి రోడ్డు పక్కన రూ.50 వేలు అందిస్తుండగా ఏసీబీ అధికారులు మాటు వేసి ఏఈని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడి వద్ద ఉన్న నగదును స్వాధీనం చేసుకున్నారు. పృథ్వీపై కేసు నమోదు చేసి నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరుపర్చుతామని ఏసీబీ డీఎస్పీ కృష్ణగౌడ్ తెలిపారు.

## ఏటీఎంలో 27.75 లక్షలు లూటీ

**పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో ఘటన**

ఫర్టిలైజర్‌సిటీ, ఫిబ్రవరి 10: పెద్దపల్లి జిల్లా రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని గోదావరిఖని గౌతమినగర్‌లో గల ఓ బ్యాంకు ఏటీఎం కేంద్రంలో భారీ చోరీ జరిగింది. గ్యాస్ కట్టర్‌తో మెషిన్‌ను కట్ చేసి ఏకంగా రూ.27.75 లక్షలు లూటీ చేశారు. శనివారం ఉదయం వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. గోదావరిఖని గంగానగర్‌లోని ఫ్లైవర్ బ్రిడ్జి సమీపంలో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రంలోకి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించారు. అర్ధరాత్రి 1.34 గంటలకు సీసీ కెమెరా వైర్లను కట్‌చేయడంతో అలారం మోగగా పరారయ్యారు. అక్కడి నుంచి ఎన్టీపీసీ రింగ్‌రోడ్ మీదుగా ఆర్ఎఫ్‌సీఎల్‌కు వెళ్లే మార్గంలో అభయాంజనేయస్వామి, అయ్యప్పస్వామి దేవాలయం మధ్యగల గౌతమినగర్ ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రానికి చేరుకున్నారు. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో ఏటీఎంలోకి ప్రవేశించి సీసీ కెమెరాలకు బ్లాక్ స్ప్రే కొట్టి, వైర్లను కత్తిరించారు. తర్వాత గ్యాస్ కట్టర్ సాయంతో మెషిన్‌ను కత్తిరించారు. అందులోని రూ.27,75,400 నగదును దోచుకుని ఉడాయించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చోరీ జరిగిన పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో గౌతమినగర్ ఏటీఎం సెంటర్



kissan
పెద్ద ప్యాక్
కేవలం
₹70/-
₹50/-
kissan
FRESH TOMATO KETCHUP
425g

## కాంగ్రెస్ ఎంపీ సాహూపై ఈడీ ప్రశ్నల వర్షం

రాంచీ, ఫిబ్రవరి 10: మనీ లాండరింగ్ కేసులో జార్ఖండ్‌కు చెందిన కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ ప్రసాద్ సాహూను ఈడీ శనివారం దాదాపు 11 గంటలపాటు ప్రశ్నించింది. ఇటీవల జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సొరేన్‌ను అరెస్టు చేసిన భూ కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులోనే సాహూను విచారించినట్టు అధికారులు వెల్లడించారు. ఆదివారం కూడా విచారణకు రావాలని సూచించారు. హేమంత్ సొరేన్ ఢిల్లీ నివాసంలో స్వాధీనం చేసుకొన్న లగ్జరీ కారుతో సంబంధాలపై ఈడీ సాహూ స్టేట్‌మెంట్‌ను తీసుకొంటున్నట్టు అధికారులు తెలిపారు. ఆ కారు, కారులో పట్టుబడిన నగదుతో తనకు సంబంధం లేదని ఈడీ విచారణ తర్వాత ధీరజ్ సాహూ పేర్కొన్నారు. ధీరజ్ కుటుంబానికి చెందిన డిస్టిలరీ కంపెనీలో గత డిసెంబర్‌లో ఆదాయ పన్ను శాఖ నిర్వహించిన సోదాల్లో లెక్కల్లో చూపని రూ.351.8 కోట్లు నగదు పట్టుబడిన విషయం తెలిసిందే.

## కత్తిపోట్ల కలకలం

- ఇద్దరికి గాయాలు

బాల్కొండ, ఫిబ్రవరి 10: నిజామాబాద్ జిల్లా బాల్కొండలో కత్తిపోట్ల ఘటన కలకలం సృష్టించింది. స్థానిక వన్నెల్(బీ) చౌరస్తా వద్ద సయ్యద్ రఫీక్ అనే వ్యక్తిని సయ్యద్ సొఫియాన్, సయ్యద్ రిహాన్ చాకుతో దాడిచేశారు. ఈ దాడిలో రఫీక్‌తోపాటు స్నేహితుడు అతారుద్దీన్‌కు గాయాలయ్యాయి.

## విద్యార్థినుల ఆత్మహత్యలు ప్రభుత్వ హత్యలే

- విద్యా, సంక్షేమ శాఖలకు మంత్రులను కేటాయించాలి
- బీఎస్పీ కన్వీనర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 10: భువనగిరిలో ఇటీవల ఉరేసుకుని చనిపోయిన పదో తరగతి హాస్టల్ విద్యార్థినులవి ఆత్మహత్యలు కావని, అవి ప్రభుత్వం చేసిన హత్యలని బీఎస్పీ రాష్ట్ర కన్వీనర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. భువనగిరి పట్టణంలోని ఎస్సీ వసతి గృహంలో ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్న గదిని శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం విద్యార్థినుల తల్లిదండ్రులను పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి వసతి గృహ విద్యార్థులకు బడ్జెట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. భవ్యశ్రీ, వైష్ణవి ఆత్మహత్యలు అనుమానాస్పదంగా ఉన్నాయని, ఈ ఘటనపై ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. కొత్త ప్రభుత్వం వచ్చి రెండు నెలలు గడుస్తున్నా విద్యా, సాంఘిక సంక్షేమ శాఖలకు మంత్రులను కేటాయించిందలేదని విమర్శించారు. పిల్లలవి ఆత్మహత్యలు కావని, వారి మరణాలకు ఆటో డ్రైవరే ప్రధాన సూత్రధారి అని, విద్యార్థినుల మెడపై గాట్లు ఉన్నాయని తల్లిదండ్రులు ఎంత చెప్పినా వినిపించుకోకుండా వారి బంధువులపైనే కేసు పెట్టించడం ఎంతవరకు సమంజసమని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. భవ్యశ్రీ, వైష్ణవి కుటుంబంలో ఒక్కొక్కరికి ప్రభుత్వ ఉద్యోగంతోపాటు రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 12న శాంతియుతంగా సంక్షేమ భవన్ ముందు ధర్నా నిర్వహిస్తామని, ఈ ధర్నాలో బీఎస్పీతోపాటు అన్ని పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు, డాక్టర్లు, విద్యావేత్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.



భువనగిరి ఎస్సీ హాస్టల్‌లో భవ్యశ్రీ, వైష్ణవి బంధువులతో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్



కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన శిష్యులకు వెండి బ్రాస్‌లెట్లను బహూకరిస్తున్న గురువు గంగాధర్

## శిష్యులకు గురువు బహుమానం

- కానిస్టేబుల్‌గా ఎంపికైన ఎనిమిది మందికి వెండి బ్రాస్‌లెట్ల బహూకరణ

మెట్‌పల్లి, ఫిబ్రవరి 10: తన వద్ద కోచింగ్ తీసుకున్న అభ్యర్థులు ఉద్యోగాలు సాధించడంతో ఆ గురువు ఆనందంలో మునిగితేలారు. ఇచ్చిన మాట ప్రకారం వెండి బ్రాస్‌లెట్లను బహూకరించి ఔదార్యాన్ని చాటారు రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్, జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన గంగాధర్. నిరుడు పట్టణంతోపాటు ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాలకు చెందిన పలువురు ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు స్థానిక అంబేద్కర్ స్టేడియంలో ఉచితంగా శిక్షణ ఇచ్చారు. ఎస్సై ఉద్యోగానికి ఎంపికైతే బంగారు, కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైతే వెండి బ్రాస్‌లెట్లు అందజేస్తానని గంగాధర్ మాట ఇచ్చారు. ఇటీవల కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన ఎనిమిది మందికి శనివారం మెట్‌పల్లిలో వెండి బ్రాస్‌లెట్లను బహూకరించారు.

## గురుకులంలో ఇంటర్ విద్యార్థిని మృతి

సూర్యాపేట రూరల్, ఫిబ్రవరి 10: అనుమానాస్పద స్థితిలో ఇంటర్ విద్యార్థిని మృతి చెందింది. ఈ ఘటన సూర్యాపేట మండలం ఇమాంపేట గురుకుల పాఠశాలలో శనివారం రాత్రి చోటుచేసుకున్నది. మృతురాలి బంధువుల కథనం ప్రకారం.. సూర్యాపేటకు చెందిన వెంకన్న కుమార్తె ఇమాంపేట గురుకులంలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నది. తన కూతురు శనివారం సాయంత్రం వీడియో కాల్ చేసి మాట్లాడినట్టు మృతురాలి తల్లి భాగ్యమ్మ తెలిపింది. రాత్రి 10 గంటల సమయంలో హాస్టల్ నుంచి ఎవరో ఫోన్ చేసి 'మీ పాప ఆరోగ్య పరిస్థితి బాగోలేదు. సూర్యాపేట ప్రభుత్వ దవాఖానకు రావాలి' అని చెప్పినట్టు ఆమె పేర్కొన్నారు. దవాఖానకు చేరుకునే సరికి తమ కుమార్తె మృతి చెందినట్టు విలపించారు.